# అనామిక డైరీ



– సలీం

నేను హత్యానేరం మీద జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీని. నా పేరు చెప్పుకునేంత ప్రముఖురాలినేమీ  కాదు. చెప్పినా నేనెవ్వరో ఎవ్వరికీ తెలియదు. అనామకురాల్ని. ఈ జైలుకొచ్చి నెలదాటింది. రోజంతా ఫినాయిల్ తయారుచేయడంలోనో, కొవ్వొత్తులు తయారు చేయడంలోనో శ్రమ పడటం...వాళ్ళు పెట్టే తిండేదో తినడం.. నాకు కేటాయించిన బ్యారక్‌లో పడుకోవటం.. బ్యారక్లకు నదుల పేర్లు పెట్టారు. గంగా. గోదావరి, సరస్వతీ అంటూ...నా బ్యారక్ పేరు క్రిష్ణ...మొత్తం పది మంది ఖైదీలం. రకరకాల నేరాలు చేసి శిక్షలు అనుభవిస్తున్న వాళ్ళు. నాతో పాటు మరో ఖైదీ కూడా జీవిత ఖైదు అనుభవిస్తోంది.

నేర ప్రవృత్తి ఉన్న ఆడవాళ్ళు కాబట్టి రోజూ ఏదో ఒక గొడవ... తిట్టుకోవడం.. జుట్లు పట్టుకుని కొట్టుకోవడం.. సమాజం మీద ఉన్న కసీ, జైలు గోడల మధ్య స్వేచ్ఛను కోల్పోయి, పంజరంలో పక్షుల్లా ఉన్నామన్న ఉక్రోషం..విసుగూ.. చిరాకు..మానసిక వత్తిడీ... అన్నీ కారణాలే గొడవలకి.

నాకూ విసుగ్గానే ఉంది. ఎత్తుగా కన్పిస్తున్న జైలు గోడలు.. కత్తిరించిన ముక్కలా కన్పించే కొద్దిపాటి ఆకాశం... బ్యారక్‌లో తోటి ఖైదీల వికృత ప్రవర్తనా...నాకు వూపిరాడటం లేదు. ఎవ్వరితో మాట్లాడాలనిపించడం లేదు. ఎవరైనా పోట్లాడినా బదులివ్వాలనిపించడంలేదు.

గదిలో ఉన్నంత సేపూ ఉక్కపోతగా ఆలోచనలు.. ఏవేవో జ్ఞాపకాలు...మెదడుని కుమ్మరి పురుగులా తొలుస్తూ గుర్తుకొస్తున్న అనేకానేక సంఘటనలు.. గడిచిపోయిన జీవితమంతా కళ్ళముందు రివైండ్ అవుతూ...

నాకో వ్యాపకం కావాలి. లేకపోతే పిచ్చిదాన్నయిపోతాను. నా అనేవాళ్ళు లేని జీవితం ఎంత భయంకరంగా ఉంటుందో తెలుస్తోంది. ఒంటరితనం మరీ భయపెడుతోంది. దాన్నుంచి దూరంగా పారిపోవడానికి నా జ్ఞాపకాల్ని రాద్దామనుకున్నాను. నాకున్న కొద్దిపాటి చదువు ఉద్యోగం తెచ్చుకోడానికి ఉపయోగపడకున్నా, కనీసం కాగితాలమీద నా జీవితాన్ని నెమరేసుకోడానికి పనికొస్తుందనిపించింది.

నేను రాయబోయేదాన్ని నా ఆత్మకథ అనను. ఆత్మకథ రాసుకునేంత గొప్ప జీవితం కాదు నాది.. గదిలో కూచుని.. ఏవీ తోచక... పదునుగా  గుచ్చుకునే ఆలోచనలతో మనసుని గాయం చేసుకోవడం కంటే వాటిని కాగితం మీద పెడితే బావుంటుందేమోనన్న

ఆలోచన... కేవలం నా కోసం... నా మనశ్శాంతి కోసం... నేను సంపాయించుకున్న కూలీ డబ్బుల్లో సగం నా పేరున బ్యాంకులో జమ చేస్తారు. మిగతా సగం ప్రతినెలా చేతికిస్తారు. ఆ డబ్బుల్తో క్యాంటీన్లో దొరికే నోటు పుస్తకాలు రెండు కొన్నాను. రెండు బాల్ పాయింట్ పెన్నులూ కొన్నాను. నా జీవితంలో నాకు గుర్తున్న సంఘటనలు రోజూ కొద్ది కొద్దిగా రాయాలన్న సంకల్పం... బాగా బాధ కలిగించే విషయాలూ, సంతోషాన్నిచ్చిన సంఘటనలూ...ఇవేగా ఎవరికైనా గుర్తుండిపోయేవి.

నాకు బాగా గుర్తున్న సంఘటన నా ఏడో యేట జరిగింది.

ఆ రోజు రాత్రి...పెద్దగా ఏడుపు విన్పిస్తే ఉలిక్కిపడి నిద్రలోంచి లేచాను. చుట్టూ చీకటి..కళ్ళు చిట్లించి చూశాను. రెండు అస్పష్టమైన రూపాలు.. తొందరగానే పోల్చుకున్నాను. అమ్మా, నాన్నా...మళ్ళా పోట్లాడుకుంటున్నారు. ఇంతకుముందు వారానికో, రెండు వారాలకో ఓ సారి అమ్మ ఏడుపు విన్పించేది. ఇపుడది ప్రతిరోజూ విన్పిస్తోంది. దబ్బున శబ్దమైంది.

నాన్న అమ్మని మంచం మీంచి కిందికి తోసేసి “చావు. నువ్వు చస్తేగాని నాకు మనశ్శాంతి ఉండదు” అన్నాడు.

కింద పడ్డందుకు అమ్మ ఏడ్వలేదు. బంతిలా లేచి నిలబడింది. వూడిపోయిన కొప్పుని ముడేసుకుంటూ, “నిన్ను నమ్మి నీతోపాటు వచ్చేసినందుకు నాకు మిగిలింది చావే. చస్తాను. నేను పోతే నువ్వా వగలాడితో కులుకుదామనుకుంటున్నావేమో. నీకా అవకాశం ఇవ్వను. నిన్ను చంపి మరీ చస్తాను” అంది.

నేనా మాటలు విని భయంతో వణికిపోయాను. అమ్మానాన్న వాళ్ళ చావు గురించి మాట్లాడుకుంటున్నారు తప్ప నా గురించి ఆలోచించటమే లేదు. ఇద్దరూ చచ్చిపోతే నాకు దిక్కెవరు? నన్నెవరు చూసుకుంటారు? నాకు ఏడేళ్ళే. వంట ఎవరు చేస్తారు? పంపు దగ్గరనుంచి నీళ్ళెవరు తెస్తారు? కళ్ళు గట్టిగా మూసుకుని పడుకున్నాను.

“అది నా భార్య. దాన్నేమైనా అంటే నాలిక చీరేస్తాను. అది నేను తాళి కట్టిన భార్య” నాన్న గొంతు...

“మరి నేనెవర్ని?”

"నాకేం తెలుసు? వెళ్ళి ఎవర్నయినా అడుగు చెప్తారేమో"

"ఎవర్నో అడగాల్సిన ఖర్మ నాకేం పట్టింది? నేనూ నీ భార్యనే. మొదట నన్ను చేసుకున్నాకే దాన్ని చేసుకున్నావు."

"నువ్వు భార్యవా? ఎలా అవుతావు? తాళి కట్టానా? తలంబ్రాలు పోశానా? వళ్ళు కొవ్వెక్కి పదిహేనేళ్ళ వయసుకే నాతో లేచొచ్చావు. లేచొచ్చిన దాన్ని పెళ్ళామనరు. ఉంచుకున్నదంటారు"

"నీతో కాపురం చేసే కదరా కూతుర్ని కన్నానూ... దానికి నువ్వు తండ్రివి కాదంటావా? పక్కింటి వాడితో పడుకుని కడుపు తెచ్చుకున్నాననుకున్నావా? నిప్పురా ... నిప్పులా బతికిన దాన్ని. ఆ విషయంలో నన్ననుమానించావా పురుగులు పడి చస్తావు" అమ్మ ఏడుస్తోంది.

"నేను కనమన్నానా? వద్దనే చెప్పాగా. నువ్వే విన్లేదు. పట్టుబట్టి మరీ కన్నావు. నువ్వెలా దాన్ని పోషించుకుంటావో నీ ఇష్టం. నాకేమీ బాధ్యత లేదు"

"ఛీ నువ్వూ ఓ మగాడివేనా? నన్ను మాయమాటల్తో నమ్మించి నా గొంతు కోశావు. సరే. నా ఖర్మనుకున్నాను. ఆ పసిది ఏం పాపం చేసిందని దాన్ని శిక్షిస్తావు? దానిమీద ఇంతైనా ప్రేమలేదా నీకు?"

"నాకు ప్రేమల గురించి తెలీదు. నాకిపుడో భార్య ఉంది. దాన్ని సరిగ్గా చూసుకోవాల్సిన బాధ్యత నామీద ఉంది. నిన్నూ, నీ కూతుర్ని పోషించే శక్తిలేదు. నీదారి నువ్వు చూసుకోవటం మంచిది"

"నన్నూ నా కూతుర్ని నట్టేట్లో ముంచేసి నీ దారిన నువ్వు పోతానంటే వూర్కోను. నిన్ను బజారు కీడుస్తా"

"ఏం చేస్తావే.. కోర్టుకెళ్తావా? వెళ్ళు. కేసు పెడ్తావా? పెట్టు. అదసలు నాకు పుట్టనే లేదని చెప్తా. నీ దిక్కున్న చోట చెప్పుకో పో"

వాళ్ళ అరుపులకి అలవాటు పడేకొద్దీ నిద్ర ముంచుకు రాసాగింది. వాళ్ళ మాటలు ఎక్కడో దూరం నుంచి విన్పించసాగాయి. దూరంగా... సుదూరంగా...గుసగుసలుగా మెల్లగా.. చీకట్లో లుప్తమైపోతూ... చల్లటి గాలి.. అమ్మ జుట్టు పాయలుగా ఎగురుతోంది. పడవ మెల్లగా కదుల్తోంది. నీటి అలలు నా చేతిని తాకి తరలిపోతున్నాయి. అమ్మ

నవ్వుతోంది. ఉత్తినే.. పెద్దగా నవ్వుతోంది. పిచ్చిదానిలా నవ్వుతోంది. నాన్నకు తలమీద రెండు కొమ్ములు మొలిచాయి. నోటిలో రెండు కోరలు మొలిచాయి. అమ్మను అమాంతం ఎత్తి నీళ్ళల్లో పడేశాడు. అమ్మ నీళ్ళలో గిలగిలా కొట్టుకుంటోంది. ఒడ్డున పడ్డ చేపలా..అమ్మ శవం నీళ్ళ మీద తేలుతోంది. పడవలా... నాన్న మాయం. నీటి అలలిప్పుడు సముద్రపు అలల్లా ఎగసి పడ్తున్నాయి. పడవ వణికిపోతోంది. నాకు భయమేస్తోంది. పడవ ఒక్కసారిగా తల్లకిందులైంది. నేను నీళ్ళలో మునిగిపోతున్నాను. 'అమ్మా నాన్నా' అని అరుస్తున్నాను. ఎవ్వరూ పలకటం లేదు. నా చేతినెవరో పట్టుకున్నారు. రాములు.. పక్క గుడిసెలో ఉండే మాలతమ్మ కొడుకు. వాడు నవ్వుతున్నాడు. పెద్ద అల వచ్చింది. వాడి చేయి వదులైంది. నేను వేగంగా కొట్టుకుపోతున్నాను. చచ్చిపోబోతున్నాను.

చప్పున మెలకువొచ్చింది. ఏవో శబ్దాలు.. చీకటిగానే ఉంది. అమ్మానాన్నల గొంతులు.. "ఎంత పోట్లాడినా ఇది మాత్రం వదలవు కదా" అంటోందమ్మ.

"నీకూ నీ కూతురికి ఉత్తినే తిండి పెడ్తున్నాననుకున్నావా? నేను ఖర్చుపెడ్తున్న డబ్బులకు సరిపడా దండుకోవాలిగా" అంటున్నాడు నాన్న.

నాకలవాటైన దృశ్యమే. చూడకూడదనుకుంటూనే కళ్ళు చిట్లించి చూస్తున్నా. అమ్మ నవ్వుతోంది. పిచ్చిదానిలా నవ్వుతోంది. కల గుర్తొచ్చింది. ఇపుడు నాన్నకు కోరలూ కొమ్ములూ మొలుస్తాయా? అమ్మను చంపేస్తాడా? భయంతో కళ్ళు మూసుకున్నాను. పోట్లాడుకోవటం... కొట్టుకోవడం... మళ్ళా ఇలా నవ్వుకోవడం.. ఏమిటో అర్థమే కావటం లేదు. అమ్మానాన్న పోట్లాడుకోకుండా ఇలా నవ్వుకుంటూ ఉంటే ఎంత బావుంటుందో.. ఎప్పుడూ ఇలానే ఉండకూడదూ... పక్క గుడిసెలోని రాములు వాళ్ళ అమ్మానాన్న కూడా ఇలానే తగువులాడుకుంటారు. వాళ్ళ నాన్న తాగొచ్చి రాములు వాళ్ళమ్మని చావగొడ్తాడు.

రాములు మంచోడే. నా కన్నా రెండు మూడేళ్ళు పెద్ద. స్కూల్ కెళ్ళడు. బస్తీలోని తోటి పిల్లల్తో కలిసి గోలీలాడ్తాడు. చెట్ల కింద కూచుని బీడీలు కాలుస్తాడు. వాళ్ళ నాన్న కొట్టడానికెళ్తే తారాజువ్వలా పరుగెత్తుతాడు. వాడలా పరుగెత్తుతుంటే నాకెంత నవ్వొస్తుందో. మొన్నొకరోజు వాడు దొరికిపోయాడు. వాళ్ళ నాన్న కాళ్ళతో చేతుల్తో కొడ్తుంటే కొట్టకు నాన్నా అంటూ కింద పడి దొర్లుతూ ఏడ్చాడు. అప్పుడూ నాకు నవ్వాగలేదు. వాడలా ఏడుస్తూనే నా వైపు కోపంగా చూశాడు. నాకు భయమేసింది. రెండ్రోజులు వాడికి

కన్పించకుండా తప్పించుకు తిరిగాను. రేపు కూడా జాగ్రత్తగా ఉండాలి.

అమ్మ నిద్రపోయినట్టుంది. సన్నటి గురక విన్పిస్తోంది. నాన్న తిట్టినపుడో కొట్టినపుడో అమ్మ ఏడుపు వింటుంటే నాకూ ఏడుపొస్తుంది. మా అమ్మంటే నాకెంతిష్టమో. అపుడపుడూ అమ్మ నన్ను కొడ్తుంది. 'ఛీ. నా కడుపున ఎందుకు పుట్టావే ముదనష్టపుదానా' అని తిడ్తుంది. అప్పుడు చాలా బాధేస్తుంది. కొద్దిసేపైనా కాకముందే అమ్మ నన్ను వాటేసుకుని 'నా బంగారు తల్లిని కొట్టాను కదా. నా చేతులిరిగిపోను. ఇంకెప్పుడూ కొట్టనమ్మా. నువ్వు నా ప్రాణం కదూ...నువ్వు నా తల్లివి కదూ' అంటూ ముద్దు చేస్తుంటే ఎంత బావుంటుందో.

నాకు నిద్ర రావటం లేదు. కళ్ళు తెరిస్తే చీకటి. కళ్ళు మూస్తే ఇందాకటి కల మళ్ళా వస్తుందేమోనని భయం.. అమ్మో ఎంత భయంకరమైన కలో.. ఎన్ని నీళ్లో .. సముద్రమంత నీళ్ళు.. బుల్లి పడవలో నేను..ఎంత పెద్ద కెరటాలో... రాక్షసుల్లా మీద పడితే పడవ తల్లకిందులు కాకుండా ఎలా ఉంటుంది? నా కల్లోకి రాములు ఎలా వచ్చాడో..వాడ్ని రేపడగాలి. అమ్మో... నేను నవ్వినందుకు తప్పకుండా తిడ్తాడు. కోపమొస్తే కొడ్తాడేమో... వుహు... కొట్టడు. వాళ్ళింట్లో చేపల కూర వండితే చేప ముక్కని కాగితంలో చుట్టి నిక్కర్ జేబులో దాచుకొచ్చి ఇస్తాడు కదా. నాకు చేపలిష్టమని ఓ సారి వాళ్ళమ్మతో మా అమ్మ అంటుంటే విన్నాడట. అప్పట్నుంచి అంతే. చేపల వేపుడు చేస్తే రెండు మూడు ముక్కలు తెచ్చి తినిపిస్తాడు. వాడి నిక్కర్ నిండా చేపల కంపు...

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు. ఉదయం అమ్మ లేపుతుంటే మెలకువ వచ్చింది. అప్పటికే గుడిసెనిండా ఎండ పర్చుకుంది. పొయ్యిలోంచి బొగ్గుముక్క తీసుకుని నములుత్తూ గుడిసె బైటికొచ్చి చూశాను. రాములు కన్పించలేదు. బర్రెగొడ్లు కాసే వాళ్ళతో వెళ్ళి బుట్టనిండా పేడ నింపుకొస్తే వాళ్ళమ్మ పిడకలు చేసి అమ్ముతుంటుంది. ఉదయాన్నే ఆ పనిమీద వెళ్ళి ఉంటాడు. మా గుడిసె ముందు తడికల్తో కట్టిన చిన్న దడిలో స్నానం చేసి అమ్మ పెట్టిన సద్దన్నం తిని బడికి బయల్దేరాను. సగం దూరం వెళ్ళి సందు మలుపు తిరగ్గానే ఎదురుగా యముడిలా నిలబడి ఉన్నాడు రాములు. వాడు పేడ ఏరుకు రావడానికి వెళ్ళాడని పొరపాటు పడ్డాను. నా కోసం బడి దగ్గర కాపు కాశాడని ఇపుడర్థమైంది.

నేను ధైర్యాన్ని కూడదీసుకుని "జరుగు.. బడికెళ్ళాలి" అన్నాను.

"మొదట నేనడిగేదానికి సమాధానం చెప్పు" అన్నాడు. వాడు కోపంగా ఉన్నాడని తెలుస్తోంది.

పెద్దగా అరుద్దామనుకున్నాను. అమ్మకు విన్పిస్తుందో లేదో. రాములు వాళ్ళ నాన్నకు విన్పించినా  చాలు. మళ్ళా వీడికి బడితె పూజ ఖాయం. అలా అనుకోగానే నా మనసులో రాములు కింద పడి దొర్లటం గుర్తొచ్చి నవ్వొచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నావు?" అన్నాడు కోపంగా.

"నవ్వొచ్చింది నవ్వాను. తప్పా"

"కారణం చెప్పు?"

"చెప్పను"

"సరే. మొన్న మా అయ్య కొడ్తుంటే ఎందుకు నవ్వావు?"

"నువ్వు కిందపడి దొర్లుతుంటే నవ్వొచ్చింది" అంటూనే మళ్ళా నవ్వాను.

"అదిగో మళ్ళా... నిన్ను కొడ్తానిపుడు. అపుడు చూస్తా నవ్వెలా వస్తుందో"

"నన్ను కొడ్తే మీ నాన్నకు చెప్తా. అపుడు చింతకాయ పచ్చడిలా మళ్ళా తన్నులు తింటావు"

"మా అయ్యకు చెప్తావా? ఏదీ చెప్పు చూద్దాం"

"కొట్టు చూద్దాం"

"కొట్టననుకున్నావా. చూడెలా కొడ్తానో" పిడికిలి బిగించి పొట్టలో గుద్దాడు.

నొప్పితో మెలికలు తిరిగి పోయాను. కిందపడి ఏడుస్తుంటే వాడు పారిపోయాడు. బడికెళ్ళకుండా ఏడుస్తూ యింటి వైపుకు నడుస్తున్నాను. సందు చివర్లో రాములు నిలబడి ఉన్నాడు.

వాడ్ని చూసి "మీ అయ్యకు చెప్తానుండు" అన్నాను.

వాడు నిక్కర్ జేబులోంచి చిన్న చాకు తీసి నా కళ్ళముందు ఉంచి "చెప్తావా.. నిన్ను పొడిచి పారిపోతాను" అన్నాడు.

నాకు బాగా భయమేసింది. “చెప్తావా?” అన్నాడు చాకుని నా పొట్ట దగ్గర గురిచూస్తూ..

“చెప్పను” అన్నాను.

“అలా రా దారికి. నిన్ను గమనిస్తూనే ఉంటా.. చెప్పావని తెలిసిందా ఏ అర్ధరాత్రో మీ గుడిసెలోకి దూరి నిన్ను పొడిచేస్తా”

నా ఏడుపు ఆగిపోయింది. యింటికెళ్ళగానే వంటినిండా దుమ్ము, కళ్ళలో కన్నీటి చారికలు చూసి “ఏమైందే.. ఎవరైనా కొట్టారా?” అని అడిగింది అమ్మ.

చుట్టూతా చూశాను. ఓ గుడిసె చాటున దాక్కుని ఉన్నాడు రాములు. వాడి చేతిలో చాకుంది. దాన్ని చూపిస్తూ ఏదో అంటున్నాడు.

“లేదమ్మా. పడ్డాను”

“సర్లే. యింకేం వెళ్తావు బడికి? నాతో పాటు వస్తావా? యింట్లో ఉంటావా?” అని అడిగింది.

“వస్తాను” అన్నాను సంతోషంగా. బడికెళ్ళడం కన్నా అమ్మతో పాటు గుడికెళ్ళడం బావుంటుంది. గుడి ముందు అమ్మ ఓ గోనెపట్టా పరిచి దానిమీద పూజా సామగ్రి పెట్టి అమ్ముతూ ఉంటుంది. టెంకాయలు, అగరొత్తులు, కర్పూరం బిళ్ళలు... అలా అమ్మ పక్కన కూచుని గుడికి వచ్చేపోయే మనుషుల్ని చూస్తుంటే సమయమే తెలీదు. రక రకాల మనుషులు... రంగు రంగుల బట్టల్లో అమ్మాయిలు... నాకూ అలాంటి అందమైన బట్టలు వేసుకోవాలని ఉంటుంది. జుట్టుకి రకరకాల క్లిప్పులు పెట్టుకోవాలనీ, మొహానికి క్రీములూ పౌడర్లూ రాయాలని, తలకి వాసన నూనె పూయాలని, పెదాలకు లిప్ స్టిక్ రాయాలనీ... ‘నా కూతురికి ఎన్నెన్ని కోరికలో...దీనికి స్వప్నా అని ఏ ముహూర్తంలో పేరు పెట్టానో... ఎన్నెన్ని కలలు కంటుందో... ఇవన్నీ తీర్చాలంటే ఏ రాజకుమారుడో నీకు మొగుడిగా రావాలి’ అని నవ్వేస్తో ఉంటుంది అమ్మ.

“మొదట కొట్టుకెళ్ళి కొత్తిమిర, పచ్చిమిరపకాయలు కొనుక్కుని రా. చట్నీ చేస్తాను. తర్వాత గుడిదగ్గరకెళ్దాం” అంది.

అమ్మ యిచ్చిన డబ్బులు తీసుకుని కొట్టు దగ్గరకు పరుగెత్తాను. ఎపుడొచ్చాడో తెలీదు. నా వెనకే నవ్వుతూ నిలబడి ఉన్నాడు రాములు. వాడు నవ్వుతున్నా నాకు చాకు గుర్తొచ్చి భయమేసింది.

మాట్లాడకుండా వెనక్కి తిరిగి వస్తుంటే వాడు నా పక్కనే నడుస్తూ "కోపమొచ్చిందా?" అన్నాడు. నేనేమీ  సమాధానం చెప్పలేదు.

"నీ కోపం ఎలా పోగొట్టాలో నాకు తెలుసులే" అన్నాడు.

'ఏం తెలుసు నీకు?' అన్నట్టు కళ్ళెత్తి వాడి వైపు చూశాను.

నిక్కర్ జేబులో చేయి పెట్టాడు. నేను అరుద్దామని నోరు తెరిచే లోపల నా చేతిలో రెండు చాక్లెట్లు పెట్టాడు. చాకు కాకుండా చాక్లెట్లు చూడగానే పోయిన ప్రాణం తిరిగొచ్చింది.

నాకు వాటిని తీసుకోవాలని ఉన్నా "నాకొద్దు" అన్నాను బెట్టుగా.

"చాకు తీయనా?" అన్నాడు బెదిరిస్తూ.

చప్పున చాక్లెట్లు తీసేసుకున్నా.

"మనం దోస్త్.. సరేనా" అన్నాడు. సరేనని తలూపి యింటి వైపు పరుగెత్తా.

⍟ ⍟ ⍟

**నా**న్న యింటికొచ్చి వారం దాటింది. నాకు నాన్నని చూడాలని ఉంది.

"అమ్మా... నాన్నెప్పుడు వస్తాడు?" కసువూడుస్తున్న అమ్మనడిగా.

"ఏం..నాన్న లేకపోతే ముద్ద దిగదా?" అమ్మ కోపంగా జవాబిచ్చింది.

"నాన్న యిక రాడా?"

"రాడని ఎవరు చెప్పారు? వూరెళ్ళి ఉంటాడు. వస్తాడు ఏదో రోజు"

రాములు చెప్పాడని అమ్మకు చెప్పలేదు. రాములుకి కోపం వస్తే చాకు చూపిస్తాడని భయం.  నాన్నకు మరో యిల్లుందనీ అందులో మరో ఆవిడ ఉంటుందనీ ఆమె నాకు పిన్నవుతుందని రాములు చెప్పాడు. ఈ సంగతులన్నీ రాములు వాళ్ళమ్మ ఎవర్తోనో చెప్తుంటే విన్నాడట.

"నేను నాన్న దగ్గరకెళ్తాను" అన్నాను.

అమ్మ చివ్వున తలయెత్తి చూసి "ఎక్కడుంటాడని వెళ్తావే?" అంది.

"నాన్న ఎక్కడుంటాడో నాకు తెలుసు. పిన్ని వాళ్ళింట్లో ఉంటాడు."

అంతే. అమ్మ కళ్ళు అగ్ని గోళాల్లా మారాయి. చీపురు తిరగేసి అందిన చోటల్లా కొట్టింది. "ఎవరే నీకు పిన్ని? వేలెడంత లేవు, అప్పుడే పెద్దోళ్ళ విషయాల్లో తల దూర్చేంత ఆరిందా ఐపోయావా?" అంటూ బాది పడేసింది.

దెబ్బలు తింటూనే "నాకు నాన్న కావాలి. నేను నాన్నను చూడాలి" అన్నాను.

"మళ్ళా వాడి వూసెత్తావా నాలిక మీద వాతలు పెడ్తా" అంది అమ్మ. అంత కోపంలోనూ అమ్మ ఏడుస్తూ ఉండటం గమనించాను.

"నాలుగు రోజులు తిండి పెట్టకుండా మాడిస్తేగాని నీకు బుద్ధి రాదు. యింకెప్పుడూ నాన్న కావాలని అడగననే వరకు అదే నీకు శిక్ష" అని తలుపు బైట గడియపెట్టి అమ్మ గుడి దగ్గరకెళ్ళిపోయింది.

నేను చాలా సేపటివరకు నేల మీద పడుకుని ఏడుస్తూ ఉండిపోయా.

నాకు వూహ తెల్సినప్పటినుండీ పెనవేసుకున్న నాన్న జ్ఞాపకాలు... నాన్న మొదట్లో చాలా ప్రేమగా ఉండేవాడు. యింటికి రాగానే మొదట నన్ను వొళ్ళో కూచోబెట్టుకుని 'నా చిట్టితల్లి ఇప్పటివరకు ఏం చేసింది' అని అడిగేవాడు. 'నాన్న కోసం ఎదురుచూసింది' అనేదాన్ని. ఎంత పెద్దగా నవ్వేవాడో... నాన్న అలా నవ్వితే ఎంత బావుండేదో.. అలా చెప్పమని అమ్మే నేర్పేది. వాటిని చిలుక పలుకుల్లా వల్లించేదాన్ని.

నాన్న చాక్లెట్లో, బిస్కెట్లో తెచ్చేవాడు. ఉత్త చేతుల్తో ఎప్పుడూ వచ్చేవాడు కాదు. వాటిని వెనక దాచి 'నా చిట్టి తల్లికి చాక్లెట్ కావాలా బిస్కెట్ కావాలా' అని అడిగేవాడు. 'నాకు నాన్న కావాలి' అనే దాన్ని. మళ్ళా పెద్దగా నవ్వేవాడు. అదీ అమ్మే నేర్పింది.

నన్నెత్తుకుని తన రిక్షాలో కూచోబెట్టుకుని షికారు తిప్పేవాడు. 'దాన్ని కూచోబెట్టుకుని వూరంతా తిప్పితే బేరాలెక్కడనుంచి వస్తాయి? ఈ రోజు పస్తులే' అనేది అమ్మ. 'నా చిట్టి తల్లి దర్జాగా రిక్షాలోఎలా కూచుందో చూడు. మహరాణిలా...బేరాలు తగలకపోతే మానె. పస్తులుండాల్సి వచ్చినా పర్లేదు. నా బంగారు తల్లి బాగుంటే చాలు' అనేవాడు.

మొదట్లో అలా నాన్న తొక్కుతున్న రిక్షాలో కూచుంటే బాగానే ఉండేది. రాను రాను అది నచ్చటం మానేసింది. నేను సీట్లో కూచుంటే నాన్న రిక్షా తొక్కడం బాగుండేది కాదు.

నాన్నా నేను పక్కపక్కన రిక్షాలో కూచుని షికారుకెళ్ళాలని ఆ రిక్షా వేరెవరైనా తొక్కుతూ ఉండాలని అనుకునేదాన్ని.

నాకు గుర్తుండి నేను జరుపుకున్న పుట్టిన రోజు పండుగ నా ఐదో యేట జరిగింది. ఉదయం నిద్రలేవటంతోటే 'పుట్టిన రోజు శుభాకాంక్షలు నా చిట్టి తల్లికి' అన్నాడు నాన్న. అప్పుడు రోజూ నాన్న మా యింట్లోనే ఉండేవాడు. 'తొందరగా స్నానం చేయి. నాన్న నీ కోసం కొన్న కొత్త గౌన్ వేసుకుందువుగాని' అంది అమ్మ. అలా అందేగాని నేను స్నానం చేస్తుంటే అమ్మ లోపలికొచ్చి వళ్ళంతా సబ్బుతో బాగా రుద్దీ రుద్ది స్నానం చేయించింది. తలకు షాంపూ పెట్టి జుట్టంతా కడిగింది. 'ఎంత పెద్ద జుట్టో  నీది. ఇద్దరికీ సరిపోతుందని చిన్న షాంపూ పాకెట్ కొన్నా. నీకొక్కదానికే వచ్చేలా ఉంది' అంది అమ్మ. పొడవాటి నా జుట్టంటే అమ్మకెంతిష్టమో. 'మా అమ్మ పోలికొచ్చింది' అని మురిసిపోయేవాడు నాన్న.

గులాబీ రంగు సిల్కు గౌన్...ఎంత బావుందో. తల దువ్వి, మొహానికి పౌడర్ రాసి, బొట్టు పెట్టింది. కళ్ళకు కాటుక రాసి నాన్నతో 'చూశావా నీ కూతుర్ని. అచ్చం మన కనకదుర్గ గుళ్లోని  అమ్మోరిలా లేదూ.. కళ్ళు చూశావా..అరచేయంత వెడల్పున, తేటగా ఎలా ఉన్నాయో..అమ్మోరిని తెప్పలో వూరేగించే కొలనులా లేవూ' అంది అమ్మ. 'నా కూతురి కి నా దిష్టే తగిలేలా ఉందమ్మోవ్' అనుకుంటూ బుగ్గన కాటుకతో చిన్న చుక్క పెట్టింది.

నాన్న మార్కెట్ కెళ్ళి చందువా చేపలు తెచ్చాడు. 'తొందరగా వంట చేయి. మేమిద్దరం అలా  బైటికి వెళ్ళొస్తాం' అన్నాడు నాన్న.

'ఎక్కడకీ... ఈ రోజు రిక్షా వేయవా?' అంది అమ్మ.

'ఈ రోజు అన్నీ బంద్. దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి కదా. నా చిట్టితల్లిని గుడికి పిల్చుకెళ్తా. ఆ అమ్మ తల్లికి నా చిట్టి తల్లిని చూపించి చల్లగా ఉండేలా దీవించమని మొక్కుకుని వస్తా' అన్నాడు

నన్నెత్తుకుని కొండెక్కాడు. ఎంత మంది జనమో...ఎటు చూసినా తిరునాళ్ళలా జనం.. క్రిక్కిరిసి పోయి..క్యూలో నిలబడ్డాం. ఎంత పొడవుగా ఉందో... నాకు కాళ్ళు నొప్పెడతాయేమోనని ఎత్తుకుని  భుజం మీద కూచోబెట్టుకున్నాడు.

మెల్లగా కదుల్తున్నారు ముందున్న వాళ్ళు. గంటగ్గానీ అమ్మవారి దర్శనం కాలేదు. నా

కళ్ళల్లో ఇప్పటికీ ఆ రోజు చూసిన అమ్మవారి రూపం కదుల్తో ఉంటుంది. ఎంతందమైన రూపమో.. ఎంత పెద్ద కళ్లో.. ప్రేమగా చల్లగా చూస్తున్నట్టు.. వంటినిండా రకరకాల నగలు.. చిలకపచ్చ రంగు పట్టుచీర... 'అమ్మోరికి దండం పెట్టుకో' అన్నాడు నాన్న. మా ముందున్న ఆంటీ కళ్ళు రెండూ మూసుకుని దండం పెట్టుకోవడం చూశాను. నాకు కళ్ళు మూసుకోవాలనిపించలేదు. అలానే కళ్ళు తెరిచి అమ్మవారి అద్భుతమైన రూప సౌందర్యాన్ని, అలంకరణని చూస్తూ ఉండిపోవాలనిపించింది.

తిరిగొచ్చేటపుడు షాపులో బోల్డన్ని చాక్లెట్లు కొన్నాడు. నా గౌనుకి ముందు వైపున్న జేబునిండా వాటిని నింపి 'చాలా యింకా కావాలా' అన్నాడు నాన్న. యింటికి రాగానే పక్క గుడిసెలో ఉన్న రాములు వాళ్ళమ్మ నన్ను చూట్టానికి వచ్చింది. ఆమెతో పాటే రాములూ ఉన్నాడు. నా మొహం చుట్టూ చేతులు తిప్పి మెటికలు విరుస్తూ 'అబ్బ. నా కోడలు పిల్ల ఎంతందంగా ఉందో. ఇదుగో ముందే చెప్తున్నా కమలమ్మా నీ కూతుర్ని నా కొడుక్కిచ్చి లగ్గం చేయాల' అంది. నా వైపు తిరిగి 'నా కొడుకుని పెళ్ళి చేసుకుంటావుగా' అని అడిగింది. నేను రాములు వైపు చూశాను. వాడికి ముందు రెండు పళ్ళు వూడిపోయి ఉన్నాయి. అప్పటివరకూ మట్టిలో ఆడుకుని వచ్చినట్టున్నాడు వళ్ళంతా దుమ్ముకొట్టుకుని ఉంది. 'ఛీ.. నా కొద్దు' అన్నాను. అందరూ పగలబడి నవ్వారు. వాళ్ళలా నవ్వుతుంటే ఎందుకు నవ్వుతున్నారో అర్థంకాక సిగ్గుతో ముడుచుకు పోయాను.

ఆ రోజు మధ్యాహ్నం మ్యాట్నీ సినిమాకెళ్ళాం. ఏదో సినిమా ... గుర్తు లేదు. హాల్లో నిద్రపోయానట. అమ్మ చెప్పింది. సినిమా హాలు నుంచి బైటికొచ్చాక క్రిష్ణా బ్యారేజీ చూట్టానికెళ్ళాం. రెండు బుడగలు కొనిచ్చాడు నాన్న. పుల్ల ఐస్ క్రీం కావాలని అడిగితే అమ్మ కోప్పడింది. 'ఈ రోజు నా చిట్టితల్లి ఏమడిగినా కాదనేది లేదు' అన్నాడు నాన్న. ఎంత సంతోషమేసిందో...గాల్లో తేలిపోతున్నట్టు..

అమ్మంటే ఇష్టమే. నాన్నంటే ఇంకొంచెం ఎక్కువ ఇష్టం నాకు. ఎటొచ్చీ ఈ మధ్యనే అమ్మని బాగా కొడ్తున్నాడు. అమ్మ ఏడుస్తుంటే నాన్న మీద కోపం వస్తోంది. నాన్నని చూసి ఎన్ని రోజులైందో. ఇపుడు కోపంగా లేదు. నాన్నని చూడాలని ఉంది. అంతగా ప్రేమించిన నాన్న నన్ను చూడకుండా ఇన్ని రోజులు ఎలా ఉన్నాడో.. 'ఉదయాన్నే లేచి నా చిట్టి తల్లి మొహం చూస్తే చాలు. బేరాలు బెమ్మాండంగా దొరుకుతాయి' అనే నాన్న.. మరి ఈ

చిట్టి తల్లి మోహం చూడకుండా రిక్షా ఎలా వేస్తున్నాడో.

నాకో విషయం అర్థమైంది. నాన్న మంచోడే. పిన్నిని పెళ్ళి చేసుకున్నప్పటి నుంచే నాన్న మారిపోయాడు. అమ్మను కొడ్తున్నాడు. నన్ను మర్చిపోయాడు. నేనే నాన్నని మర్చిపోలేకుండా ఉన్నాను.

ఆకలేస్తోంది. యింట్లో తినడానికెమైనా ఉన్నాయా అని వెతికాను. ఏమీ దొరకలేదు. అమ్మ నా మీద కోపంతో వంట చేయకుండా వెళ్ళిపోయిందిగా. తలుపు తీయడానికి ప్రయత్నించాను. రాలేదు. తడిక మీద గట్టిగా బాదాను. ఎవ్వరూ పలక లేదు. పక్కింటి రాములు వాళ్ళమ్మా నాన్నా పనికి వెళ్ళిపోయి ఉంటారు. రాములు గోలీలాడటానికి వెళ్ళి ఉంటాడు. మళ్ళా వచ్చి నేలమీద పడుకున్నా. నీరసంగా ఉంది. దాహంగా ఉంది. లేచి కుండలో నీళ్ళు గ్లాసుతో వంచి గటగటా తాగాను. పొట్టలో చల్లగా అన్పించింది.

తడిక మెల్లగా ఎవరో తీస్తున్న అలికిడి... అమ్మ వచ్చిందనుకుని గభాల్న లేచి తలుపు దగ్గరకెళ్ళాను. కొద్దిగా తెరిచి ఆ సందులోంచి చూస్తున్నాడు రాములు. నన్ను చూడగానే పూర్తిగా తలుపు తెరిచాడు. “ఎందుకు లోపలున్నావు? బైట గొళ్ళెం ఎవరు పెట్టారు?” అని అడిగాడు.

“అమ్మ” కళ్ళలో నీళ్ళు నింపుకుంటూ చెప్పాను.

“ఎందుకు?”

“నాన్నని చూడాలని ఉందంటేనూ కోపమొచ్చి కొట్టింది” అన్నాను.

“మీ అయ్య ఎక్కడుంటాడో నీకు తెలుసా? ఎలా వెళ్తావు చూట్టానికి?”

“రిక్షా తొక్కే మల్లేష్ ఇల్లెక్కడని రిక్షా వాళ్ళనడిగితే చెప్తారు”

నా మాటలకు రాములు పకపకా నవ్వాడు. “మీ అయ్య ఉండేదెక్కడో నాకు తెలుసు” అన్నాడు. “ఒకరోజు మీ అయ్య రిక్షా ఇచ్చేసి యింటికెళ్తుంటే నేను ఎంటపడి పొయ్యా. అప్పుడు చూశా. నీ పిన్నిని కూడా చూశా. చాలా బావుంటుంది తెలుసా” అన్నాడు.

“మా అమ్మ కన్నా బావుంటుందా?”

“ఓ.. తెల్లగా ఉంటుంది”

నాక్కోపమొచ్చింది. "మా అమ్మ కన్నా ఎవ్వరూ అందంగా ఉండరు తెలుసా" అన్నాను.

రాములు నవ్వాడు తప్ప ఏమీ అన్లేదు.

"నాకు మా నాన్న వాళ్ళ యిల్లు చూపియ్యవా?" అని అడిగా.

"అమ్మో.. మీ అమ్మకు తెలిస్తే మా అయ్యకు చెప్పి కొట్టిస్తుంది"

"నేనెవ్వరికి చెప్పను. అమ్మ తోడు" నెత్తిమీద చేయి పెట్టుకుంటూ అన్నాను.

కొద్దిసేపు తల గోక్కుంటూ నిలబడ్డాడు. "పద వెళ్దాం" వాడి చేయి పట్టుకుని లాగాను. తలుపుకి గొళ్ళెం పెట్టి వాడి వెంట బయల్దేరాను. పాత వంతెన పక్కనున్న గుడిసెల దాకా పిల్చుకెళ్ళి "అదుగో కన్పిస్తుందే.. అదే యిల్లు" అన్నాడు.

నాకు ఉద్వేగంతో గుండె వేగంగా కొట్టుకుంది. ఆ గుడిసెలో నాన్నుంటాడు. నన్ను చూడంగానే పరుగెత్తుకుంటూ వచ్చి 'నా చిట్టితల్లి నన్ను వెతుక్కుంటూ వచ్చిందా' అంటూ మురిసిపోతాడు.

పిన్నిని తల్చుకోగానే భయమేసింది. పిన్ని కొడ్తుందేమో.. రాములు చెప్పాడుగా పిన్ను లెవ్వరూ మంచోళ్ళు ఉండరని..

"నువ్వూ రావా? నాకు భయమేస్తోంది" అన్నాను.

"అమ్మో నేను రాను. నువ్వెళ్ళు. నాకు పనుంది. వెళ్తాను" అన్నాడు.

"నేనొచ్చేవరకు ఇక్కడే ఉండవా?" బతిమాలుతున్నట్లు అడిగాను.

"అమ్మో మీ అయ్య చూస్తే కొడ్తాడు. యిల్లు చూపించమన్నావు చూపించాను. అంతే. నాకింకేమీ తెలీదు" వాడు గిరుక్కున వెనక్కి తిరిగి పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు. వాడిని రెండు మూడుసార్లు పిల్చినా తిరిగి చూళ్ళేదు.

అక్కడే కొద్దిసేపు ఏం చేయాలో తెలీక నిలబడ్డాను. నాన్నని చూడాలన్న కోరిక మరీ బలంగా ఉండటంతో ఆ గుడిసె వైపుకు మెల్లగా అడుగులేశాను. తడిక వేసి ఉంది. ఏమని పిలవాలో అర్థం కాలేదు. తడిక దగ్గర నిలబడి "నాన్నా.. నాన్నా" అని పిలిచాను. సమాధానం రాలేదు. మరోసారి "నాన్నా" అని పిలిచేలోపల తడిక తీసుకుని ఒకామె బైటికొచ్చింది. అమ్మకన్నా ఎత్తుంది. అమ్మకన్నా రంగుంది. సన్నగా రివటలా ఉందామె.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Anamika+Diary**

* * *